


# గురుదక్షిణ

- కారంపూడి వెంకట రామదాస్

మచిలీపట్నం- సికింద్రాబాద్ రైలు సికింద్రాబాద్ స్టేషన్ పదవ నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదకి వచ్చి ఆగింది. అప్పుడు సమయం సుమారుగా ఐదుగంటలౌతున్నది. కొద్దికొద్దిగా తెలతెలవారుతూ వుంది. పోర్టర్ల హడావిడీ... కాఫీ, టీ బోయ్స్ అరుపులతో సందడి అప్పుడే మొదలైంది.

తన లగేజ్ రెండు చేతులతో మోస్తూ మెల్లిగా డోర్ దగ్గరకొచ్చాడు రంగారావు మాష్టారు. 'తక్కువ సామాను ఎక్కువ సౌఖ్యం...' అన్న సూక్ష్మ సత్యాన్ని బాగా అర్థం చేసుకున్నందున ఎక్కువ బరువుల్లేకుండా ముందే 'జాగ్రత్త పడ్డంతో యిప్పుడు పెద్దగా కష్టం అనిపించలేదు. సామానుతో కిందకి దిగి యిటు అటు చూసారు. గోపి రిసీవ్ చేసుకుందుకి వస్తానన్నాడు... ఏడీ చెప్మా...? అని ఆ జనంలో వెతికే ప్రయత్నం చేసారు. అల్లంత దూరంలో తనని వెతుక్కుంటూ వస్తున్న గోపి కనబడగానే హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు రంగారావు.

'పెదనాన్నగారూ.. ప్రయాణం బాగా సాగిందా?" అని పలకరించాడు గోపి, రంగారావుని సమీపించి.

"ఏ యిబ్బందీ లేకుండా హాయిగా సాగిందిరా... నువ్వెలావున్నావు? మీ అమ్మానాన్నా కులాసాయేనా..." అక్కడే కుశల ప్రశ్నలేశాడు రంగారావు.

"అంతా బాగున్నాం.. పదండి బయల్దేర్దాం" అంటూ పెదనాన్న చేతిలోని లగేజి అందుకుని ముందుకి కదిలాడు గోపి.

యిద్దరూ వచ్చి కారు ఎక్కారు. గోపి డ్రయివ్ చేస్తుంటే రంగారావు వెనక సీట్లో కూర్చుని కబుర్లు చెబుతూ కిటికీ గుండా బయటకి చూస్తున్నాడు.

"చాలా మారిపోయిందిరా హైద్రాబాద్.. ఈ ఆకాశ హర్మ్యాలూ.. అవీ పదేళ్ళ క్రితం లేవురా.. మరీ జనారణ్యంగా మారిపోయింది కదరా ఈ సిటీ..."

"యిప్పుడేం చూసారు పెదనాన్నా.. మరికొన్ని గంటలాగితే అసలైన హైద్రాబాదును చూడొచ్చు. జనంతో పోటీపడుతూ వాహనాలూ తమ సంఖ్యేం తక్కువ కాదని రోడ్లని ఆక్రమిస్తయి. అప్పుడు మనం ముందుకి కదలడమే కష్టం. యించుమించు అన్ని జంక్షన్లలో యిదే తీరు. అప్పుడు చూడలి హైద్రాబాద్...! ఈ సిటీకి దండం పెట్టీ ఎవరైనా పారిపోవలసిందే!" అంటూ నవ్వాడు గోపి.

ఎప్పుడో పదేళ్ళ క్రితం వచ్చాడు రంగారావు. అప్పటికీ ఎంతో మార్పు! హైటెక్ హంగులతో యిప్పుడు సాంప్రదాయానికి తిలోదాకాలిచ్చిసింది. యిన్నాళ్ళ తరువాత.హైద్రాబాద్ రావడం తప్పనిసరై వచ్చాడు. రిటారై దాదాపు సంవత్సరం కావచ్చినా యింకా పెన్షన్ రాలేదు. జిల్లా స్థాయిలో పనులు పూర్తయి, హైద్రాబాద్ సచివాలయానికి ఫైనల్ సేంక్షన్కి పంపారు. ఎన్ని రోజులైనా రాకపోయేసరికి కావలసి వ్యక్తి సమాచారం ప్రకారం సచివాలయంలో గోవిందన్న వ్యక్తి వద్ద తన ఫైల్ పెండింగులో వుందట! పని తొందరగా కావాలంటే హైద్రాబాద్ వెళ్ళి ఆ గోవిందుని కలిసి తీరల్సిందేనని తెలుసుకునీ ఈ ప్రయాణం పెట్టుకున్నాడు. అవసరమైతే నాలుగు రోజులుండడానికైనా సిద్ధపడీ మరీ వచ్చాడు. అందులో తమ్ముడు ఎన్నో రోజులనుండీ హైద్రాబాద్ రమ్మని ఒకటే పోరు.. యిలా రెండు విధాలా కలసిరావడంతో ఈ ప్రయాణం పెట్టుకున్నాడు.

ఇల్లు చేరడంతో 'పెదనాన్నా... యిల్లొచ్చింది.." అంటూ కారాపాడు గోపి.

గేటు వద్ద అలికిడవ్వడంతో రంగారావు తమ్ముడు బయటకొచ్చి.. 'రా అన్నయ్యా.. రా...!' అంటూ సాదరంగా ఆహ్వానించాడు. యింతలో లోపలి నుండి గోపి అమ్మ బయటకొచ్చీ..

"రండి బావగారూ.. ఎలా వున్నారు? అక్కయ్యా, బాగున్నారా?" అంటూ ఆప్యాయంగా పలకరించింది.

"ఆc..బాగున్నాం. మీ అక్కయ్య అందర్నీ అడిగినట్టు చెప్పమంది. ముఖ్యంగా నిన్ను, యివిగో ఈ గులాబీ మొక్కలు నీకిష్టమనీ మీ అక్కయ్య పంపింది" అంటూ బిగ్ షాపర్ లోంచీ మొక్కల్ని తీసిస్తూ అన్నాడు. కాఫీ తాగుతూ కులాసా కబుర్లతో కాసేపు గడిపాకా స్నానానికి లేచాడు రంగారావు.

❖ ❖ ❖

రంగారావు సచివాలయంవద్ద ఆటో దిగాడు. సరిగ్గా అప్పుడు పదైంది. స్టాఫంతా అప్పటికే వచ్చుంటారని అడుగుపెట్టాడు. కానీ ఒక్క రూములో కూడా ఒక్కడూ కనబడలేదు. ఆశ్చర్యపోయారు. ఆమధ్య టి.వి.లో వచ్చిన వార్త గుర్తుకొచ్చింది. పదకొండు దాటాక ఒక్కొక్కరే వస్తూ టీ.వీ. కెమేరాకి చిక్కిన సచివాలయం స్టాఫ్... ఊc... ఏం చేసినా ఈ స్టాఫ్ నడవడిలో ఎటువంటి మార్పూ లేదని తెలుసుకొని నిట్టూర్చారు.

మరో గంటసేపు గడిచాక గానీ సీటులోకి ఎవ్వరూ రాలేదు. యింకో అరగంటకి సచివాలయానికి వచ్చిపోయే వారితో సందడి మొదలైంది.

గోవిందం అన్న వ్యక్తిని అంత పెద్ద సచివాలయంలో ఎక్కడో కనుక్కోవడానికి రంగారావుగారికి పది రూములూ నాలుగు ఫోర్లూ తిరగాల్సొచ్చింది. దాంతో ఆయనకి సహనం, సత్తువా సన్నగిల్లాయి. గోవిందం అనే సీనియర్ ఆఫీసర్ ఎక్కడుంటాడని కనీసం మరో పది మందినైనా అడిగాక గానీ అతడుండే సీటుని పట్టుకోలేకపోయాడు.

"ఏంటి? ఏం కావాలి సార్...!" అన్నాడు గోవిందు రంగారావుని చూసి.

"నా పేరు రంగారావు.. పది నెలల క్రితం హెడ్మాష్టరుగా చేసి మచిలీపట్నంలో రిటారైనా...యింకా నాకు పెన్షన్ యితర సెటిలిమెంట్స్ అందలేదు. మా స్కూల్ నుండి అన్ని పేపర్లూ మీకు పంపి ఆరు నెలలైంది. వాటి పరిస్థితేంటో కొంచెం చూసి చెప్తారా?"

ఓ పది నిమిషాలు ఆ అరా ఈ అరా వెతికి, ఏవో ఫైల్స్ మధ్య దుమ్ము పట్టిన ఓ ఫైలు తీసాడు గోవిందం. ఆ ఫైల్ వైపు చూసిన రంగారావు హృదయం బాధతో మూలిగింది. ఓ మనిషి జీవితాన్ని శాసించే అతి ముఖ్యమైన ఫైలు యిలా ఎక్కడో.. అసలుందో లేదో అనే స్థితిలో... ఎంత నిర్లక్ష్య ధోరణి? ఫైలు ఏమైనా అయితే అనుభవించేది ఎవరు? తనలాంటి రిటైర్డ్ పెర్సన్సే...! యింతకీ ఆ ఫైల్లో అన్ని పేపర్లూ సరిగ్గా వున్నాయో లేవో? ఏవైనా మిస్సయితే? మళ్ళీ అవి రాలేదూ యివి రాలేదూ.. అంటూ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంటుకీ యిటూ సెక్రటేరియట్ మధ్య ఫైలు చెక్కర్లు కొడుతుంది. అక్కడ ఫైల్స్ మెంటైన్ చేసే తీరు చూసి రంగారావుకు కోపమొచ్చింది. మనసులోనిదంతా కక్కేయాలనుకున్నారు. కానీ కష్టంమీద తమాయించుకున్నారు. తొందర పడితే మొదటికే మోసమని కంట్రోల్ చేసుకున్నారు.

"సార్...! నా ఫైల్ పాస్ కావడానికి యింకా ఎన్ని రోజులు పడుతుందీ...?" లోలోపల వళ్ళు మండుతున్నా వీలైనంత శాంతంగానే అడిగారు రంగారావు.

"అవుతుందండీ... నా చెకింగ్, ఆపై మా హెడ్డూ ఫైనల్‌గా చీఫ్ సెక్రటరీ.. యిలా స్టేజ్స్ వున్నాయి. తొందర పెడితే జరిగే పనులా యివీ?" ఫైల్ లోకి చూస్తూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు.

"అది కాదండీ! ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు... ఆరు నెలలై ఫైలు యిక్కడే పడుంది... అందుకే కాస్త శ్రద్ధ తీసుకుని ఫైల్ని ముందుకు నడుపమని నా ప్రార్థన..."

రంగారావు మాటలకి ఘాటుగా జవాబివ్వాలనుకున్నాడు గోవిందం. అయితే ఆ సరికే ఫైల్లో రంగారావు

రికార్డ్ చూసి ఆ పని చేయలేకపోయాడు. కారణం, రంగారావు జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ స్థాయిలో రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కూడా అందుకున్నట్టు వివరాలుండటమే! దాంతో తనని తాను తమాయించుకునీ...

"మాస్టారూ...! మిమ్మల్ని యిబ్బంది పెట్టడం నా ఉద్దేశం కాదు గానీ, అలా ఒక్కసారి పక్కకి రండి మాట్లాడుకుందాం" అంటూ సీటు నుండిలేచి బయట కొచ్చాడు గోవిందం.

'ఎందుకో..?' అనుకుంటూ గోవిందం వెనకే నడిచారు రంగారావు.

ఇద్దరూ రూమ్ బయట వరండాలోకొచ్చారు.

"చూడండీ.. ఈ వయసులో ఈ ఆఫీసుల చుట్టూ మీరేం తిరుగుతారు గానీ మీకొచ్చేదాంట్లో ఫైవ్ పర్సంట్ యివ్వండీ మీరు మీ ఊరు తిరిగి వెళ్ళేలో పల పెన్షన్ పేపర్స్ మీ ముంగిట్లో వుంటాయి" కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడి తన లంచావతారాన్ని చూపించాడు గోవిందం.

"ఇది అన్యాయం.. అవసరమైతే పై అధికారులని కలుస్తాను. నేను లంచం యిచ్చుకోలేను."

"నేనడుగుతున్నదే పై అధికారులకోసం.. యిందులో నా వంతు అంతంత మాత్రమే.. ఆ పై మీ యిష్టం.. మీ పని దానంతటదే జరగాలంటే.. యింకొన్ని వారాలూ పట్టొచ్చూ నెలలైనా పట్టొచ్చూ.."

రంగారావుకి ఏం చెయ్యాలో పాలుపోలేదు. కుదరదూ అంటే అసలుకే మోసం వచ్చేటట్టుంది. అందుకే ఆలోచనలో పడ్డాడు.

"నాక్కొంచెం టైం యివ్వండి. .. ఏ సంగతీ చెప్తా."

మాస్టారు ఆలోచనలో పడేసరికి అతడే దిగి వస్తాడని గోవిందం మనసులోనే నవ్వుకున్నాడు.

"అదీ.. ఆలోచించుకోండి.. నే చెప్పింది చేస్తే మీకే మంచిది" అని మనసులో 'పూర్ మాస్టార్..' అనుకుని గోవిందం తన సీటుకేసి దారితీసాడు.


అక్కడ నుండి కదిలాడు రంగారావు. అతనికి తల తిరిగిపోతున్నాది. ఎక్కడైనా కాస్త కాఫీ తాగితే కానీ ఈ బాధనుండీ బయట పడేది లేదనుకున్నాడు. ఆలోచిస్తూనే బయటపడ్డాడు.

"మాస్టారూ...!" అన్న మాట వినిపిస్తే ఎవరా అది? అని వెనుదిరిగి చూసాడు రంగారావు.

దగ్గర్లో ఆరడుగుల ఎత్తూ, పుష్టిగా వున్న వ్యక్తి కనబడ్డాడు. ఎక్కడో చూసిన గుర్తు... కానీ ఎవరో గుర్తుకు రావడం లేదు. ఎవరా అని పోల్చుకునే ప్రయత్నం చేసేలోగా..

"నేను.. మాస్టారూ..! విశ్వాన్ని.. అదే విశ్వనాథం.. మీ దగ్గర చిన్నప్పుడు హైస్కూల్ చదువు చదివాను. మీరు ముద్దు విశ్వం అని కూడా పిలిచేవారు.." అంటూ క్లూ అందించాడు.

అప్పుడు గుర్తు పట్టాడు రంగారావు. నిజమే.. వీడు విశ్వం.. ఎప్పుడూ క్లాసులో పిల్లల్ని కొడుతూ వాళ్ళు తెచ్చుకునేవి లాక్కుని ఏడిపించేవాడు. నోటిబలం, భుజ బలంతో పిల్లల్ని హడలెత్తించేవాడు. చదువు తక్కువా, అల్లరెక్కువా చేయడంతో ఎన్నో సార్లు తన చేతిలో దెబ్బలు కూడా తిన్నాడు. వీడిలాగే వుంటే అసలు భవిష్యత్తులో ఏ ఉద్యోగానికైనా అర్హత సంపాదిస్తాడా? అని ఆ రోజుల్లో అనుకునేవాడు రంగారావు.



"చూడండీ.. ఈ వయసులో ఈ ఆఫీసుల చుట్టూ మీరేం తిరుగుతారు గానీ మీకొచ్చే దాంట్లో ఫైవ్ పర్సంట్ యివ్వండీ మీరు మీ ఊరు తిరిగి వెళ్ళేలోపల పెన్షన్ పేపర్స్ మీ ముంగిట్లో వుంటాయి"

అన్నట్టు...! తనకి ఓ నిక్‌నేమ్ కూడా పెట్టాడు. అదే.. పిలక మాష్టారని! నిజమే ఆరోజుల్లో అచ్చతెలుగు మాష్టర్ల వుండేవాడు తను. అంతే కాదు వెనక చాటుగా బ్లాక్ బోర్డు మీద పిలకతో వున్న తన బొమ్మ కూడా వాడే వేసేవాడని తనకి తెలిసిన విషయమే! అవన్నీ తెలిసీ తెలీని వయసులో పిల్లలు చేసే చేష్టలని సర్దుకుపోయేవారు. ఆ విషయం గుర్తొచ్చేసరికి అప్రయత్నంగా గుండుని తడుముకున్నాడు రంగారావు. ఆ వెంటనే తనలో తానే నవ్వుకున్నాడు.

"ఒరే... విశ్వం నువ్వట్రా...! ఎంత మారిపోయావురా? గుర్తు పట్టలేదనుకో.. పోనీ రా, ఎలా వున్నావు? ఎంతవరకు చదివావు? యిప్పుడేం చేస్తున్నావు? అంటూ అసలు చదువబ్బిందో లేదోననే కుతుహలంతో అడిగారు రంగారావు.

మాష్టారి ప్రశ్నలకి విశ్వం విరగబడి నవ్వి.

"మాష్టారూ! మీ సందేహాలన్నీ నివృత్తి చేస్తా... పక్కనున్న హోటల్‌కెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం, ఏం అంటారు?" అంటూ దగ్గర్లోవున్న హోటల్‌కేసి దారితీసాడు. రంగారావూ అదే పని మీద బయటకి రావడంతో మారు మాట్లాడకుండా విశ్వాన్ని అనుసరించారు.

హోటల్లో ఓ మంచి చోటు చూసి కూర్చున్నారిద్దరు. బేరరొచ్చి ఏం కావాలని అడిగాడు.

"మాష్టారూ! ఏం తీసుకుంటారు టిఫిన్? మొహమాట పడకుండా చెప్పండి" అన్నాడు విశ్వం.

"టిఫినొద్దు, ఓ కప్పు స్ట్రాంగ్ కాఫీ చాలు."

"ఓ..కె... ఆఁ బేరర్! రెండు స్ట్రాంగ్ కాఫీ!" అని విశ్వం ఆర్డరివ్వడంతో బేరర్ అక్కడనుండి కదిలాడు.

"ఆఁ యిప్పుడు చెప్పు విశ్వం... నా ప్రశ్నలకి సమాధానం" అన్నారు రంగారావు.

"సరే... వినండి! ఎలాగో కష్టపడి గ్రాడ్యుయేట్ అయ్యాననిపించాను. అదృష్టం కలిసొచ్చి యిప్పుడు బేంకులో ఆఫీసర్‌గా చేస్తున్నాను. యింకా పెళ్ళి కాని బ్రహ్మచారిని."

'అబ్బో... బేంక్ ఆఫీసరే...! బాగుంది...' అని మనసులో అనుకున్నారు.

"ఏ బ్యాంక్‌లో యింతకీ జాబ్?"

"ఐ.సి.ఐ.సి.ఐలో"


"సంతోషంరా... నీ అల్లరి చేష్టలకి నువ్వెలా బాగుపడతావో అని అప్పుడనుకునేవాడిని... నువ్వో" దారిలో పడ్డావు బాగుందిరా..."


యింతలో బేరర్ కాఫీ తెచ్చిన కాఫీని యిద్దరూ సిప్ చేస్తూ మాటలు కొనసాగించారు.

"యింతకీ ఈ ఊరు ఏ పనిమీదొచ్చారు?"

"అదేరా... నేనేమో పది నెలల క్రితం రిటైరైయ్యాను. ఎంతకీ పెన్షన్ పేపర్లు రాకపోయేసరికి యిదిగో సచివాలయానికొచ్చి వాకబుచేసాను. కానీ పనంత యీజీగా జరిగేటట్టు లేదు" అంటూ జరిగిందంతా చెప్పుకొని వాపోయాడు.

**(మిగతా 27వ పేజీలో)**



**(19వ పేజీ తరువాయి)**

"అరెరెరె... అక్కడ ఆఫీసులో కొందరు మా కష్టమర్లున్నారు... నన్నూ ప్రయత్నించనీయండి... యింతకీ ఎవరి దగ్గర ఫైల్ పెండింగ్ వుంది. అతడి పేరేంటిట?"

"వద్దులేరా... నీకెందుకు శ్రమ.. నా అవస్థలేవో నే పడతాలే.."

"మరేం ఫరవాలేదు... వెళ్ళి ప్రయత్నిద్దాం. రండి" అని బలవంతం చేసాడు విశ్వం.

"నేనొస్తే ఆ గోవిందం తోడు తెచ్చుకున్నానని గుర్రుగా చూడొచ్చు... నువ్వే వెళ్ళి ప్రయత్నించు" అంటూ వివరాలు చెప్పాడు రంగారావు.

విశ్వం వివరాలతో గోవిందుని కలవడానికి వెళ్ళాడు.

అరగంట గడవక ముందే ఆనందంగా తిరిగొచ్చి..

"మీ పని చేసి పెడతానని ఆ గోవిందం ఒప్పుకున్నాడు సార్... మీరిక నిశ్చింతగా వుండండి." అన్నాడు విశ్వం.

ఆశ్చర్యమేసింది.. విశ్వం చెప్పింది నిజమేనా? అని అనుకున్నాడు రంగారావు.

"మీకు డౌటైతే ఆ గోవిందుని కలసి క్లియర్ చేసుకోండి" అన్నాడు విశ్వం, మాష్టారి సందేహాన్ని గమనించి.

"ఛా.. అది కాదురా.."

"సరే.. యిది నా సెల్ ఫోన్ నెంబరు మాష్టారూ.. వుంచండి! అవసరమైతే కాల్ చెయ్యండి" అంటూ తన నెంబర్ యిచ్చాడు విశ్వం.

కాసేపు పాత కబుర్లు చెప్పుకొని యిద్దరూ లేచారు. రంగారావు బిల్లు చెల్లిస్తానన్నా ఒప్పుకోకుండా బలవంతంగా బిల్లు లాక్కుని మరీ తనే చెల్లించాడు విశ్వం. తరువాత యిద్దరూ వేరైయ్యారు.

రంగారావుకి యింకా నమ్మశక్యంకాక గోవిందుని కలిసాడు.

"సార్... రండి... మీకు విశ్వం కావలసిన వాడని ముందే చెప్పొచ్చుగా... అతడు మాకు బాగా తెలుసు. వారంలో మీ పని పూర్తవుతుంది" అని గోవిందం చెప్పడంతో తనని తానే నమ్మలేకపోయాడు రంగారావు.

దేవుడ్లా... కనబడి కోరకుండానే గురుదక్షిణగా తన పనిని చేసిపెట్టిన విశ్వంకి మనసులోనే థేంక్స్ చెప్పుకున్నాడు రంగారావు.

⁂

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలు అయ్యాక వక్క పొడి నములుతూ డ్రాయింగ్ రూమ్ సోఫాలో కూర్చుని టీపాయ్ మీదున్న పేపర్ తీసి చదువుతున్నాడు రంగారావు.

వీధిలో ఏదో గోలగోలగా వుంటే ఏంటా? అని కిటికీగుండా బయటకి చూసాడు. గొడవ జరుగుతోంది ఎదురింటి వద్దే! ఎవరో ముగ్గురు బైక్స్ మీదొచ్చారు. కండలు తిరిగి ఒడ్డూ పొడుగుతో వున్నారు. కిటికీగుండా వారి మొహాలు కనబడ్డంలేదు. వారి వీపులు మాత్రమే కనబడుతున్నాయి. ఎదురింటాయన ఏదో బ్రతిమలాడుతున్నాడు. ఆ ముగ్గురూ అతడి మాట వినడంలేదు. పైగా వారి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. వినకూడని మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఎదురింటాయన కాళ్ళా వేళ్ళా పడుతున్నా ఆ ముగ్గురూ ఊరుకోవడం లేదు. మీదుమిక్కిలి వారి ప్రవర్తన క్షణక్షణానికి దిగజారుతూ చెయ్యి చేసుకొనే వరకూ వచ్చింది...

"ఒరే గోపీ... యిలా రా! యిక్కడేదో గొడవ జరుగుతున్నది" అంటూ రంగారావు పిలిచాడు.

లోపల చదువుకుంటున్న గోపి హడావుడిగా బయటకొచ్చాడు.

పెదనాన్నతోపాటు కిటికీ గుండా బయట జరుగుతున్న గొడవ చూసి-

"పెదనాన్నా... సిటీలో యిలాంటివి మామూలే!



మాష్టారూ.. మీకు తెలీదు మాష్టారూ!.. టూ వీలర్ లోన్ తీసుకున్నప్పుడు మా బ్యాంక్ చుట్టూ వినయంగా తిరిగి తీరా లోన్ తీసుకున్నాక.. నెలసరి వాయిదా కట్టడానికి యితడికి కష్టంగా వుంది. రెండ్నెల్ల నుండి ఒక్క పైసా కట్టలేదు. అందుకే మా డ్యూటీ చేస్తున్నాం.

యిక్కడెవ్వరూ యితరుల గొడవల్లో తలదూర్చరు. మీరూ లోపలికొచ్చేయండి!" అన్నాడు పెద్దగా పట్టించుకోకా.

"ఒరే... అలా అంటున్నావేంట్రా? చూస్తే పెద్ద మనుషుల్లా వున్నారు. ఏం ప్రవర్తనరా అది?"

"వాళ్ళంతే..! సూటూ బూటూలో వున్న రౌడీలు.. ఏం చేస్తాం? తల దూరిస్తే మన మీదకొస్తారు" అంటూ లోపలికెళ్ళిపోయాడు గోపి.

యింతలో ఆ ముగ్గురిలో ఒకడు ఎదురింటాయన కాలరు పట్టుకుని కడుపులో ఒక్క గుద్దు గుద్దాడు. 'అబ్బా..' అంటూ మూలిగి కిందపడ్డాడు దెబ్బతిన్నతడు.

ఇదంతా చూస్తూ ఊరుకోలేక వీధి తలుపులు తీసి బయటకొచ్చాడు రంగారావు.

"ఆగండి బాబూ... శాంతించండీ.." అడ్డుకోబోతూ అప్పుడు గమనించారు ఆ ముగ్గుర్ని.

అంతే..! అతని ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

ఆ ముగ్గుర్లో ఒకడు 'విశ్వం'!

అంతే కాదు, ఆ గుంపుకి నాయకుడు విశ్వమే అని గ్రహించడానికి అట్టే సమయం పట్టలేదు రంగారావు గారికి.

షాక్ తిన్నారు అలా యిలా కాదు.. దారుణంగా.. యింతలో విశ్వం మాష్టార్ని గుర్తుపట్టి...

"మాష్టారూ...! మీరూ... యిక్కడా...?"

"అవున్రా... నేనే... ఎదురిల్లు మా తమ్ముడిది. యిక్కడే దిగాను. అయినా ఏంట్రా యిదంతా? అసలేం చేసాడనిరా అతడ్ని అలా తంతున్నారూ?" నిలదీసారు రంగారావు.

"మాష్టారూ.. మీకు తెలీదు మాష్టారూ!.. టూ వీలర్ లోన్ తీసుకున్నప్పుడు మా బ్యాంక్ చుట్టూ వినయంగా తిరిగి తీరా లోన్ తీసుకున్నాక.. నెలసరి వాయిదా కట్టడానికి యితడికి కష్టంగా వుంది. రెండ్నెల్లనుండి ఒక్క పైసా కట్టలేదు. అందుకే మా డ్యూటీ చేస్తున్నాం."

"అదేంట్రా.. డ్యూటీ అంటున్నావు? బ్యాంకాఫీసరువని చెప్పావు కదా. మరి ఇది నీ డ్యూటీ అంటున్నావేంటీ?"

"అదే.. మాష్టారూ.. నేను రికవరీ ఆఫీసర్ని. నా డ్యూటీ డబ్బు కట్టని వారిచేత డబ్బు కట్టించడమే" చాలా సామాన్యంగా చెప్పాడు విశ్వం.

"ఒరే... మాష్టారొచ్చారు కాబట్టి యివాల్టికి బ్రతికిపోయావు.. రేపు యిదే సమయానికి వస్తాం... డబ్బు కట్టకపోయావో బండి నడపడానికి నీ కాళ్ళూ చేతులూ వుండవు.. కబడ్దార్!" అంటూ విసవిస వెళ్ళిపోతున్న విశ్వంవైపు నోట మాట లేకా చూస్తూ వుండిపోయాడు రంగారావు.

షాకు మీద షాకు తగిలింది రంగారావుకి. విశ్వం చేసే ఉద్యోగం యిదా? ఇవాళా రేపూ బ్యాంకులు యిలాంటి ఉద్యోగాలు కూడా యిస్తున్నాయా? ఊఁ... బాగుంది... చాలా బాగుందనుకున్నారు. ఈ నిజానికి రంగారావు మెదడు మొద్దుబారిపోయింది. వాడి తత్వానికి తగ్గ ఉద్యోగమే దొరికింది. అంటే.. మొన్న గోవిందంతో కూడా. ఈ పద్ధతిలోనే మాట్లాడుంటాడా? అందుకేనా అప్పటివరకూ ససేమిరా అన్న గోవిందం ఆ వెంటనే పని చేసి పెట్టడానికి ఒప్పుకున్నాడు?' ఎందుకో రంగారావు మనసు గిల్టీగా ఫీలైంది.

రంగారావులో అంతర్మధనం మొదలైంది. ఆ రోజు ద్రోణాచార్యుడు అడిగి మరీ తన శిష్యుడైన ఏకలవ్యుడి బ్రొటన వేలుని గురుదక్షిణగా పొందడం న్యాయమే అయితే... ఈ రోజు తన శిష్యుడైన విశ్వం తనకుతానే తీర్చుకున్న ఈ గురుదక్షిణ అన్యాయమెలా అవుతుంది?'- మనసు ప్రశ్న. 'ఊఁ.. ద్రోణాచార్యుడి గురుదక్షిణ వెనుక ధర్మ సంరక్షణ దాగి వుంది'- ఆత్మసాక్షి సమాధానం. 'ఊఁ... ముల్లుని ముల్లుతో తీయడమే ఈనాటి న్యాయం'- మళ్ళీ మనసు సమర్థన. 'కాదు... అందరూ అలా అనుకుంటే లోకం మోసపూరితమై భ్రష్టుపట్టిపోదా?'- ఆత్మసాక్షి ఎదురుప్రశ్న. చివరికి ఆత్మసాక్షే గెలిచింది.

లేదు... 'గోవిందాన్ని కలిసీ విశ్వం తరఫున క్షమాపణ చెప్పుకోవాలి' అన్న నిర్ణయం తీసుకున్నాక అతడి మనసు తేలికపడింది.

★


**రచయిత చిరునామా:**

**కారంపూడి వెంకట రామదాస్,**

2-4-989/202

శ్రీసాయి రెసిడెన్సీ,

రోడ్ నెం.5,

సమతాపురి కాలనీ,

హైదరాబాద్- 500 035